జగన్ పాలనలో మూడు రెట్ల అభివృద్ధి

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వం కంటే మూడు రెట్లు అభివృద్ధి పనులు చేశారని ఎంపీ కేశినేని శ్రీనివాస్ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 64వ డివిజన్ విలేజి కండ్రికలో ఎంపీ కేశినేని శ్రీనివాస్, సెంట్రల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. అనంతరం కండ్రిక సొసైటీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ 1.55 కోట్ల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలిచ్చారన్నారు. 31లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించిన ఏకైక సీఎం కూడా జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. 'సెంట్రల్'లో 2014–19వరకు ఎమ్మెల్యేగా చేసిన బొండా ఉమా గూండా, రౌడీ, భూకబ్జాదారుడని ఆరోపించారు. బ్లాక్‌మెయిలర్, అతను, అతని ఇద్దరు కుమారులు కేవలం ధనదాహంతో ఈ ప్రాంతాన్ని కబ్జా చేయడానికి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని విమర్శించారు. సెంట్రల్‌లో అతన్ని చిత్తు చిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమర్థుడైన వెలంపల్లి శ్రీనివాస్ ప్రజాసేవ చేయడానికి వచ్చారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన అనుభవంతో ఆయన సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. 60 రోజుల్లో 'సెంట్రల్'లో పెండింగ్ పనులు చేస్తున్నారు. వెలంపల్లి 20 నుంచి 25వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విలేజి కండ్రికలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, తనను గెలిపించుకుంటామని చెబుతున్నారన్నారు. 175 కి 175 సీట్లు వస్తాయనే ధీమా వ్యక్తం చేశారు. 2014–19లో ఎమ్మెల్యేగా ఉన్న బొండా ఉమాను తాము ఎన్నడూ చూడలేదన్నారు. ఈ ప్రాంత ప్రజల వద్దకు రాలేదని చెప్పారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజ మాట్లాడుతూ విలేజి కండ్రికలో అనేక అభివృద్ధి పనులు జగనన్న ప్రభుత్వంలో జరిగాయన్నారు. గతంలో ఎమ్మెల్యే బొండా ఉమా ఎందుకు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, సొసైటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, అవుతు శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, దేవిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, సాదం శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద కుటుంబాలకు వైఎస్సార్ బీమాతో ధీమా కల్పిస్తున్నామని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 27వ డివిజన్‌కు చెందిన ఆవుల వెంకటేష్ అనారోగ్యంతో మరణించారు. వెంకటేష్ కుటుంబానికి శుక్రవారం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు మట్టి ఖర్చులకు అందజేశారు. కార్యక్రమంలో 198వ సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి పి.ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన షేక్ మెహరాజ్ శుక్రవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి షేక్ మెహరాజ్‌ను పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించారు. యూనియన్ పటిష్టతకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం వైఎస్సార్ సీపీ యువజన విభాగం సభ్యులు.. గౌతం రెడ్డి, షేక్ మెహరాజ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

నలందలో ఎలక్ట్రో 2కే 24



లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎలక్ట్రో 2కే 24 ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, సర్క్యూట్ డిబగ్గింగ్, టెక్నికల్ క్విజ్, ఫ్రీ ఫైర్, లూడో, ట్రెజర్‌హంట్, మిస్టర్ అండ్ మిస్ ఎలక్ట్రో పోటీలు నిర్వహించారు. డ్రోన్, స్పైర్ ఫైటింగ్, రోబో, ఆటోమేటిక్ టెంపరేచర్ డిటెక్టర్, రోబోటిక్, ఐటీటీ బేస్డ్ అప్లికేషన్స్‌తో చేసిన పలు ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పట్టేటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎలక్ట్రానిక్స్ హెచ్‌ఓడీ కె.రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చీరల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలు, అభాగ్యులను ఆదుకోవడం.. వారిని చదివించడం, ఆధ్యాత్మికత వైపు నడిపించడంలో మంగలపూడి విశ్రాంతమ్మ సేవలు ఎనలేనివని, ఆమె జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీటీసీ(బాప్టిస్ట్ కన్వెన్షన్ ఆఫ్ తెలుగు చర్చీస్) జాతీయ ప్రధాన కార్యదర్శి, రెవ. మంగలపూడి జోసఫ్ కొనియాడారు. సంఘ సేవకురాలు మంగలపూడి విశ్రాంతమ్మ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్‌లోని బీసీటీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. అనంతరం నిరుపేద వృద్ధులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బండ్ల మరియదాస్, ఎ.ఆనందరావు, బీసీటీసీ పెద్దలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో 'చైతన్య' ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ చైతన్య విద్యాసంస్థలకు చెందిన భాస్కర్ భవన్ స్కూల్ కాంపౌండ్‌లో 10వ తరగతి విద్యార్థి రాపోలు గౌతమ్‌కుమార్ ప్రతిభ చూపి తదుపరి రౌండ్ (ఐఎంఓటీసీ)కి ఎంపికయ్యాడని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. భాస్కర్ భవన్ స్కూల్ ఆవరణలో గౌతమ్‌కుమార్‌ను శుక్రవారం అభినందించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు సెలూన్లు, బ్యూటీ పార్లర్లలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎస్ఎన్ పురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది గాంధీనగర్, సత్యనారాయణపురం ప్రాంతాలలోని సెలూన్‌లు, బ్యూటీ పార్లర్‌లలో క్షుణంగా తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలను నివారించే చర్యల్లో భాగంగానే ఈ ప్రత్యేక తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై దుర్గాభవాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారి ఆలయ మహా మండపం 7వ అంతస్తులోని కళావేదిక వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, ఉభయదాతలు, భక్తులు, పాల్గొన్నారు. ప్రతి నెలా షష్టిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులున్నా, సంతాన, వివాహ యోగం లేని వారు కల్యాణోత్సవంలో పాల్గొని సేవ చేసుకునే వారికి సమస్య పరిష్కారమవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం కళావేదిక వద్ద నుంచి స్వామి వారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా పుట్ట వద్ద ఆలయానికి తీసుకెళ్లారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.


స్వామివారి కల్యాణోత్సవం

20, 21 తేదీల్లో సిద్ధార్థలో వర్క్‌షాప్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఈ నెల 20, 21 తేదీల్లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ సహకారంతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సెస్‌పై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొనచ్చన్నారు. బెంగుళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్వీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు వర్క్‌షాప్ వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మూడు దశాబ్దాల కల నెరవేరింది

గిరిపురం కస్తూరిభాయిపేట ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): తమ ఇళ్ల స్థలాలను రెగ్యులరైజేషన్ చేయాలని మూడు దశాబ్దాలుగా గిరిపురం, కస్తూరిబాయిపేట ప్రజలు ఎదురు చూస్తున్న కల నెరవేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నగరంలోని 31 వేలకు పైగా ఇళ్ల స్థలాలు రెగ్యులరైజేషన్ చేసేందుకు ఆదేశాలు ఇవ్వగా, వాటిలో తమ స్థలాలు కూడా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు శుక్రవారం 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత రెగ్యులరైజేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదలు ఎంతో కాలంగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. ఇంటికి రిజిస్ట్రేషన్ పట్టాలు లేక పోవడంతో క్రయ, విక్రయాలతో పాటు, ఇళ్లు కట్టుకునేందుకు రుణాలు పొందాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవతో ఇప్పుడు అందరి ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 88వ సచివాలయం పరిధిలోని గిరిపురం, న్యూ గిరిపురంలలో 400 మంది స్థలాలు రెగ్యులరైజేషన్‌కాగా, 91, 92 సచివాలయాల పరిధిలోని అంబేడ్కర్ కాలనీ, కస్తూరిభాయి పేటల్లో 300 స్థలాలు రెగ్యులరైజ్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


88వ సచివాలయంలో రెగ్యులరైజేషన్ పట్టాలు అందిస్తున్న కార్పొరేటర్ అనిత

సెంటినీలో 10 వేల యూరాలజీ సర్జరీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని సెంటినీ హాస్పటల్స్‌లో పది వేల యూరాలజీ సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మొవ్వ పద్మ తెలిపారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో 8 సంవత్సరాలుగా సేవలందిస్తున్న చీఫ్ యూరాలజిస్ట్ డాక్టర్ అజయ్‌కుమార్ నేతృతంలో ఆ విభాగం మైలురాయిని చేరుకుందన్నారు. సెప్టెంబరు 2015 నుంచి ఇప్పటి వరకూ 10 వేల సర్జరీలు విజయవతంగా పూర్తి చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనరల్ యూరాలజీ సర్జరీలే కాకుండా, పిడియాట్రిక్ యూరాలజీ, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపీ, మినిమల్లీ ఇన్వేసివ్ లేజర్ ఎండోయూరాలజీ, రికన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు విజయవతంగా నిర్వహించామన్నారు. యాజమాన్యం సహకారం, వైద్యులు రాధామాధవి, ప్రసాద్, అనిత, దీప్తిల సహకారంతో ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో చైర్మన్ మొవ్వ ఆనంద్, డైరెక్టర్ విష్ణు మొవ్వ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ పద్మ మొవ్వ, యూరాలజిస్ట్ అజయ్‌కుమార్, ఆనంద్ మొవ్వ

ముస్లిం కమిటీలో యువతకు ప్రాధాన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. శుక్రవారం 63వ డివిజన్‌లో ముస్లిం యువతతో సమావేశం నిర్వహించారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గం ఆజాద్ ముస్లిం కమిటీ యూత్ అధ్యక్షుడిగా ఎం.అన్వర్‌బేగ్, ఉపాధ్యక్షుడిగా ఎం.సర్వర్‌బేగ్, ప్రధానకార్యదర్శి షేక్ జానీబాషా, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్‌లను నియమించి వారికి నియామక పత్రాలను అందజేశారు.


నియామక పత్రాలను అందజేస్తున్న షేక్‌నాగుల్‌మీరా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి. అల్లూరి సీతారామరాజు రోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి. వి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.ఎస్. రాజు రోడ్డు, దేవాలయం వీధి, వానపాల వారి వీధి, కనకరాజు వీధి, కొమ్ము వారి వీధి, రామరాజు వీధి, పాప రాజు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ ఆసరాను వినియోగించుకోండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ అనంతరం జీవనోపాధి నిమిత్తం ఇచ్చే ఆర్థిక సాయం వైఎస్సార్ ఆసరాను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా రోగి చికిత్స అనంతరం విశ్రాంతి కాలంలో రోజుకు రూ.225 చొప్పున, గరిష్ఠంగా నెలకు రూ.5వేలు చెల్లిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకం డిసెంబరు 2019 నుంచి అమలులో ఉందన్నారు. రోగి చికిత్స అనంతరం ఆధార్‌తో లింకైన బ్యాంక్ ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 17,593 మందికి రూ.10.87 కోట్లు, 2023–24లో 10,190 మందికి రూ.6.37 కోట్లు లబ్ధి చేకూరినట్లు పేర్కొన్నారు. మాతృత్వ వందన యోజన ద్వారా మొదటి సారి గర్భం దాల్చిన వారికి రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే టీకాల అనంతరం రూ.6 వేలు తల్లి బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నట్లు తెలిపారు. ఇలా 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటి వరకూ మొదటి కాన్పు గర్భిణులు 8,957 మందికి, రెండో బిడ్డ ఆడపిల్ల పుట్టిన గర్భిణులు 6,082 మందికి లబ్ధిచేకూరినట్లు డాక్టర్ సుహాసిని వివరించారు.

30వ డివిజన్‌లో సిమెంట్ బల్లల ఏర్పాటు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.జానారెడ్డి శుక్రవారం 30 సిమెంట్ బల్లలు వేయించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ స్థానికులు కూర్చునేందుకు సిమెంట్ బల్లలు కావాలని కోరారన్నారు. దీంతో తాను సొంత నిధులతో 30 సిమెంట్ బల్లలను తయారు చేయించి కూడళ్లలో ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రవి, వైఎస్సార్ సీపీ నేతలు దుర్గారావు, మహిళలు కార్పొరేటర్ జానారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను హెచ్చరించారు. భానునగర్ బీఆర్టీఎస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన చిరు వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో గుణదల పోలీసులు పాల్గొన్నారు.

నగరంలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు మరో 50 రోజులు పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ శనివారం నుంచి మే నాలుగో తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఆంక్షల సమయంలో నలుగురు, అంతకు మించిన వ్యక్తులు ఒకే చోట గూమిగూడవద్దని, కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలతో సంచరించ వద్దని హెచ్చరించారు. సిటీలోని ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టు టౌన్, గవర్నర్‌పేట, సూర్యారావు పేట, కృష్ణలంక, పటమట, మాచవరం, గుణదల, సత్యనారాయణపురం, సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వివరించారు.

మాచవరం పీఎస్ పరిధిలో పోలీస్ కవాతు

గుణదల(విజయవాడ తూర్పు): ప్రశాంత వాతావరణంలో సాధారణ ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా, ప్రజలకు భరోసా కల్పించేందుకు మాచవరంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు ఆధ్వర్యంలో, మాచవరం సీఐ గుణరామ్ పర్యవేక్షణలో జరిగిన ఫ్లాగ్ మార్చ్‌లో లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు 80 మంది మిలటరీ సిబ్బంది పాల్గొన్నారు. గుణదల సెంటర్‌లో పాటు, మాచవరం, చుట్టుగుంట, నిమ్మతోటసెంటర్, మొగల్రాజపురంలో ఈ మార్చ్ జరిగింది.

సీఎం జగన్‌తోనే సర్వతోముఖాభివృద్ధి

- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- రూ.32.59 కోట్లతో యూజీడీ పనులు ప్రారంభం

గుణదల(విజయవాడ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తోందని, ఆయనతో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదలలో రూ.32.59 కోట్లతో భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉద్ధంటి సునీత, ఎండీ షాహినా సుల్తానాలతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు 30 వేల మంది జనాభాకు సరిపడా అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులకు భూమిపూజ నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని మల్లాది విష్ణు అన్నారు. ఇందులో భాగంగా గుణదల నుంచి 60, 59 వ డివిజన్ల మీదుగా సింగ్ నగర్ ఎస్‌టీపీకి అనుసంధానిస్తూ.. 18 కి.మీ. మేర డిస్ట్రిబ్యూషన్, 8 కి.మీ. మేర పంపింగ్ మెయిన్ పనులు చేపడతామన్నారు. ఏడాదిలోగా పనులు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం, గుణదల ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం రూ. 84.73 కోట్లతో వాంబేకాలనీలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించనున్నట్లు తెలిపారు. మరోవైపు గుణదల ఆర్వోబీని పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఏలూరు రోడ్డు నుంచి వచ్చే ఏ వాహనమైనా నేరుగా ఇన్నర్ రింగ్ రోడ్డులో కలిసే విధంగా వంతెనల నిర్మాణాలను పూర్తిచేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో, ఈ ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో గమనించాలని ప్రజలను కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరంలో ఈ ఐదేళ్లలో జరిగినంత అభివృద్ధి గతంలో ఎన్నడూ చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యే మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, నాయకులు ఉద్ధంటి సురేష్, కొండా మహేశ్వరరెడ్డి, హాఫీజుల్లా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


యూజీడీ పనులకు భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

వినియోగదారుల హక్కులపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సభ జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ మనం ఏదైనా వస్తువును కొనుగోలు చేసి మోసపోతే వినియోగదారుల రక్షణకు చట్టాలు ఉన్నాయన్నారు. వాటితో నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పొందే హక్కు, ప్రాథమిక అవసరాలు పొందే హక్కు, వస్తువులు, సేవలను ఎంపిక చేసుకునే హక్కు, ఉత్పాదకాల గురించి తెలుసుకునే హక్కు ఉన్నాయని వివరించారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమ పితామహుడు రాల్ఫ్‌నాడర్ కృషితో ఈ రోజు అంతర్జాతీయ వినియోగదారుల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయని, వీటితో వినియోగదారుల సంరక్షణ, సంక్షేమం, సేవలు అందుతున్నాయని చెప్పారు. నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును లేక సేవలను కొనుగోలు చేయడం సర్వసాధారణమని చెప్పారు. ఆ వస్తువులు, సేవల్లో ఏదైనా లోపం వస్తే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, శిక్షణార్థులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగళ్ల విద్యాకన్నా

హక్కులను పరిరక్షించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల హక్కులను గుర్తించి రక్షించుకోవాలని, ఆ హక్కులను దెబ్బతీసే మార్కెట్ దుర్వినియోగాలు, సామాజిక అన్యాయాలను నిరసించడానికి కృషి చేయాలని హైకోర్టు న్యాయవాది వీవీపీ ధర్మరాయుడు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కుల వినియోగంపై వివరించారు. హైకోర్టు న్యాయవాది గంగవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువులు, సేవలు వారి తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా తీర్చాలి అన్నారు. బీఐఎస్ స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి. కృష్ణ వీర్ వర్మ మాట్లాడుతూ సమాచారం పొందే హక్కు వినియోగదారులకు ఉంటుందన్నారు. అఖిల్ భారతీయ గ్రాహక్ పంచాయతీ సతీష్ నానపనేని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వినియోగదారుల హక్కులపై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ సి. బ్రహ్మయ్య ,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

మధురానగర్ సెక్షన్‌లో 185 మందికి రూ.4.78 లక్షల జరిమానా

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం మధురానగర్ సెక్షన్ పరిధిలో కరెంట్ సర్వీసులను తనిఖీ చేశారు. 80 మంది సిబ్బంది 40 బృందాలుగా ఏర్పడి 2897 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికలోడు వినియోగిస్తున్న 185 మంది వినియోగదారులకు రూ.4.78 లక్షల అపరాధ రుసుం విధించారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలను ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలకుమారి, విజిలెన్స్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, నవీన్‌కుమార్, బసవరాజు రవిచంద్ర, కోటేశ్వరరావు, శివారెడ్డి డివిజన్ ఏఈలు పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ మేడా రజనికి అభినందన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన పేపర్ క్విల్లింగ్ ఆర్టిస్ట్ క్వీన్ ఆఫ్ క్రాఫ్ట్స్‌గా పేరుగాంచిన మేడా రజని కళా నైపుణ్యాన్ని కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రశంసించారు. కాదేదీ కళకు అనర్హం అని నిరూపిస్తూ పనికి రావనుకున్న పేపర్ ముక్కలతో రమణీయమైన కళాకృతులను చేయడం ఆమెకే చెల్లిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మేడా రజని పేపర్ తో తాను రూపొందించిన పూల బొకే, పేపర్ క్విల్లింగ్ ఆర్ట్ కలెక్టర్ ఢిల్లీరావుకు అందజేశారు.


కలెక్టర్ ఢిల్లీరావుకు.. పేపర్‌క్విల్లింగ్ ఆర్ట్‌ను అందిస్తున్న మేడా రజని

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్ అందజేశారు. హైస్కూల్‌లో చదువుతున్న 153 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, జామెట్రీ బాక్సులు, స్కేల్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. జిల్లా సైన్సు అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు డి.మోహన్, సైన్సు ఉపాధ్యాయులు రేణుక, రాధిక, నిర్మల, సునంద్, గణేష్, సత్యవతి పాల్గొన్నారు.

